# <u>యూఏఈలోని భారతీయ పౌరులకు ముఖ్యమైన సలహా</u>

**విషయం:** ఎమర్జెన్సీ సర్టిఫికేట్ / ఎగ్జిట్ పర్మిట్ / ఎమిరేట్స్ ఐడీ / వీసా రెగ్యులరైజేషన్ పేరుతో అనధికార ఏజెంట్లు, వ్యక్తులు చేస్తున్న మోసపూరిత చర్యలపై హెచ్చరిక

**1.** వీసా క్రమబద్ధీకరణ, ఎమర్జెన్సీ సర్టిఫికేట్ లేదా వైట్ పాస్‌పోర్ట్ పొందడం, యూఏఈ నుంచి నిష్క్రమించేందుకు ఎగ్జిట్ పర్మిట్ లేదా ఔట్‌పాస్ పొందడం, ఎమిరేట్స్ ఐడీ పొందడం, ఉద్యోగం ఇప్పించడం వంటి విషయాల్లో సహాయం చేస్తామని చెప్పే అనధికార వ్యక్తులు/ఏజెంట్ల మోసాలకు యూఏఈలోని పలువురు భారతీయ పౌరులు, ముఖ్యంగా బ్లూ కాలర్ కార్మికులు గురవుతున్న విషయం భారత కాన్సులేట్ జనరల్ దుబాయ్ & నార్తర్న్ ఎమిరేట్స్ వారి దృష్టికి వచ్చింది.

**2.** ఈ మోసపూరిత ప్రక్రియలో భాగంగా, కొంతమంది వ్యక్తులు/ఏజెంట్లు బాధితులకు తెలియకుండా లేదా వారి అనుమతి లేకుండా వారి ముఖం మరియు వేలిముద్రలను స్కాన్ చేయించి, ఆ బయోమెట్రిక్ వివరాలను దుర్వినియోగం చేస్తూ, వారి పేరుతో మోసపూరిత ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం, బ్యాంకు ఖాతాలు తెరవడం, రుణాలు లేదా క్రెడిట్ కార్డులు పొందడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. దీని ఫలితంగా, బాధితులు తమకు తెలియని ఆర్థిక బకాయిలు లేదా లావాదేవీలకు బాధ్యత వహించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. తద్వారా వారికి అనేక జరిమానాలు, ప్రయాణ నిషేధాలు (Travel Bans) విధించబడటంతో పాటు, కొన్ని సందర్భాల్లో జైలు శిక్షను కూడా ఎదుర్కోవాల్సి రావచ్చు.

**3.** మీ భద్రతను నిర్ధారించుకోవడానికి మరియు ఇలాంటి మోసాలకు గురికాకుండా ఉండేందుకు, భారతీయ పౌరులందరూ కింది సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించడమైనది:

ఎ) ఎట్టి పరిస్థితుల్లోనూ మీ పాస్‌పోర్ట్, ఎమిరేట్స్ ఐడీ, బయోమెట్రిక్ సమాచారం (కంటి/ముఖ స్కాన్ లేదా వేలిముద్రలు), వ్యక్తిగత మరియు ఆర్థిక వివరాలను అనధికార వ్యక్తులు లేదా ఏజెన్సీలతో పంచుకోవద్దు.

బి) ఎగ్జిట్ పర్మిట్ (ఔట్‌పాస్), ఎమిరేట్స్ ఐడీ లేదా వీసా క్రమబద్ధీకరణ కోసం బయోమెట్రిక్ స్కాన్‌లు (కంటి/ముఖ స్కాన్ లేదా వేలిముద్రలు) అవసరమైన సందర్భాల్లో అధికారిక యూఏఈ ప్రభుత్వ కార్యాలయాలు/సౌకర్యాలు/కౌంటర్ల వద్ద మాత్రమే సమర్పించాలి.

యూఏఈ అధికారులచే అనుమతి పొందిన వారమని చెప్పుకునే ప్రైవేట్ వ్యక్తులు, ఏజెంట్లు లేదా థర్డ్ పార్టీ సేవా సంస్థలకు ఎట్టి పరిస్థితుల్లోనూ మీ బయోమెట్రిక్ వివరాలను సమర్పించకండి.

సి) దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్ మరియు అబుదాబిలోని భారత రాయబార కార్యాలయం, పాస్‌పోర్ట్ లేదా ఎమర్జెన్సీ సర్టిఫికేట్ జారీ కోసం దరఖాస్తుదారుల నుంచి ఎటువంటి వేలిముద్ర స్కాన్ లేదా ముఖం/కంటి స్కాన్‌ను కోరవు. కాన్సులేట్ లేదా రాయబార కార్యాలయం పేరుతో ఎవరైనా వ్యక్తి లేదా ఏజెంట్ ఇలాంటి బయోమెట్రిక్ వివరాలను కోరితే, అది మోసపూరిత చర్యగా భావించి, వారిని నమ్మకండి లేదా వారికి ఎటువంటి వివరాలను అందించకండి.

డి) అనధికార వ్యక్తి లేదా ఏజెంట్ ఎవరైనా బయోమెట్రిక్ డేటా లేదా ఎమిరేట్స్ ఐడీ కోరుతూ మిమ్మల్ని సంప్రదించినట్లయితే, వారి వివరాలను ధృవీకరించుకోవడానికి లేదా ఇతర సహాయం పొందడానికి ప్రవాసీ భారతీయ సహాయ కేంద్రం (Pravasi Bharatiya Sahayta Kendra) ను సంప్రదించండి.

టోల్ ఫ్రీ నంబర్: 80046342

WhatsApp / SMS: 00971543090571
ఇమెయిల్: pbsk.dubai@mea.gov.in

**4.** పై విషయాలను దృష్టిలో ఉంచుకుని, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నివసిస్తున్న లేదా సందర్శిస్తున్న భారతీయ పౌరులందరూ అప్రమత్తంగా ఉండాలని భారత కాన్సులేట్ జనరల్ దుబాయ్ & నార్తర్న్ ఎమిరేట్స్ వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి సేవలను అందిస్తామని చెప్పే వ్యక్తులు లేదా ఏజెన్సీల అధికారికతను, వారి వివరాలను ముందుగా ధృవీకరించుకోవాలని మరియు ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాన్ని వెంటనే భారత కాన్సులేట్ మరియు/లేదా సంబంధిత యూఏఈ అధికారులకు నివేదించాలని సూచించడమయినది .

31 ఆగస్టు 2026

దుబాయ్